కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం, ఫిబ్రవరి7 : ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని రామునితండాలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలలో 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ బిల్లులు రద్దు, అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు అందజేస్తామని తెలిపారు. గ్రామానికి సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చీర్ల రాజేశ్వర్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు మందాల రామస్వామి, ధీరావత్ శ్రీహరినాయక్, తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, లింగస్వామి, మధుసూదన్‌రెడ్డి, వడ్త్యానాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశమా.. కాంగ్రెస్ మీటింగా?

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని టూరిజం భవన్‌లో బుధవారం నిర్వహించిన అధికారుల సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. మండలంలో చేపట్టాల్సిన, అసంపూర్తి పనులపై అధికారులతో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కనీసం విలేకరులను కూడా లోపలికి అనుమతించ లేదు. కనీసం మున్సిపల్ కౌన్సిలర్లకు కూడా సముచిత స్థానం కల్పించలేదు. కానీ, కాంగ్రెస్ నాయకులు మాత్రం సమీక్షలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పాలనలో మార్పు వస్తుందని భావించామే తప్పా, పార్టీ నాయకులతో ఇలా అధికారుల రివ్యూ సమావేశాలు నిర్వహించడం ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ అనూరాధ

దాడులకు పాల్పడితే సహించేది లేదు

- జడ్పీటీసీ అనూరాధ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి7 : ప్రశ్నించినవారిపై దాడికి పాల్పడుతామని కాంగ్రెస్ కౌన్సిలర్లు నాయకులు మాట్లాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ జాతిపిత, మాజీ సీఎం కేసీఆర్‌ను దూషిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య మాట్లాడిన మాటలను సమర్థిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం యాదగిరిగుట్టలో మీడియాతో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ కౌన్సిలర్, నాయకులు మాట్లాడిన తీరును తప్పుబట్టారు. కేసీఆర్ సామాన్య వ్యక్తి కాదని, దేశ నాయకుల మెడలు వంచి, చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన మహావ్యక్తి అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి, బీర్ల అయిలయ్యకు ఎమ్మెల్యే పదవి వచ్చిందంటే కేసీఆర్ పుణ్యమేనన్న సంగతి మర్చిపోవద్దన్నారు. ప్రశాంత యాదగిరిగుట్టలో ఇండ్లను కూలుస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అరాచకాలకు పాల్పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దాడులు, బూతులు తప్ప అభివృద్ధి ప్రస్తావన లేదన్నారు. 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడా దాడులకు పాల్పడలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులపై దాడికి పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఆరె యాదగిరి, పట్టణ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు ముక్కర్ల ఆండాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లెం స్వాతి గౌడ్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సతీశ్, సత్యనారాయణ, భాస్కర్, బాలయ్య, నర్సింహారెడ్డి, నర్సింహ, వాసు, సతీశ్‌భట్, అనిల్, నర్సింహాచారి పాల్గొన్నారు.

బోగారంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

చమురు పైప్‌లైన్లపై అవగాహన అవసరం : ఆర్డీఓ

రామన్నపేట, ఫిబ్రవరి 7: గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి చమురు పైప్‌లైన్లపై ప్రజలకు అవగాహన అవసరమని చౌటుప్పల్ ఆర్డీఓ కేవీ జగన్నాథరావు, హెచ్‌పీసీఎల్ డీజీఎం రఘుపతి, గెయిల్ డీజీఎం యోగేశ్ గౌతమ్ అన్నారు. చమురు పైప్‌లైన్ల వద్ద ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గురువారం బోగారం గ్రామస్తులు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చమురు పైప్‌లైన్ల మార్గంలో 18 మీటర్ల వెడల్పున బోరు వేయడం, సాగునీటి పైప్‌లైన్ల కోసం తవ్వకాలు చేపట్టరాదన్నారు. పైప్‌లైన్లు ఉన్నచోట సూచిక బోర్డులు ఉంటాయని, వాటిని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి, డీసీఎస్ఓ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్‌రావు, ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గౌతంకుమార్, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి, జడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, సీఐ వెంకటేశ్వర్లు, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కరుణాకర్, ట్రాన్స్‌కో ఏడీ కరుణాకర్‌రెడ్డి, ఐఓసీఎల్ జీఎం శర్మ పాల్గొన్నారు.

తాసీల్దార్ కార్యాలయం తనిఖీ

రాజాపేట, ఫిబ్రవరి 7 : తాసీల్దార్ కార్యాలయాన్ని భువనగిరి ఆర్డీఓ అమరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అలాగే సమక్క సారక్క జాతర నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తాసీల్దార్ దామోదర్, ఎంపీఓ దినకర్, యాదగిరిగుట్ట రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ రమేశ్ పాల్గొన్నారు.

సీఐ వేణుగోపాల్‌కు సన్మానం

రాజాపేట, ఫిబ్రవరి 7 : యాదగిరిగుట్ట రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌ను బుధవారం రాజాపేటలో బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సట్టు తిరమలేశ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎర్రగోకుల జశ్వంత్, అధికార ప్రతినిధి ఎర్రగోకుల రాజు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : వీధికుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వడపర్తిలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాసాని పాండు కుమారుడు ప్రణయ్ అంగన్‌వాడీ వద్ద ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధికుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు భువనగిరి ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన ప్రణయ్

ఘనంగా రోజ్ డే

చౌటుప్పల్, ఫిబ్రవరి7 : పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ రోజ్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను గులాబీ పూలతో అలకరించారు. ఆనంతరం వారికి రంగు రంగుల గులాబీ పూల విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి
- జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య వారోత్సవాలు

రాజాపేట : చల్లూరులో వన నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రాజాపేట, ఫిబ్రవరి 7 : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. పారిశుద్ధ వారోత్సవాల్లో భాగంగా బుధవారం చల్లూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ వన నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ప్రత్యేకాధికారి బాదిని వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి మహేశ్, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

తుర్కపల్లి, : పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంతో పాటు మాదాపురం, వాసాలమర్రి, ఇబ్రహీంపురం, దత్తాయపల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ దేశియా, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ప్రత్యేకాధికారులు, నాయకులు ఉన్నారు.

యాదగిరిగుట్ట : మండలంలోని సైదాపురంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు. డ్రైనేజీ సమస్యలపై గ్రామ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పనులు, గ్రామ పంచాయతీ రికార్డుల అమలు తీరును పరిశీలించారు. ఎంపీఓ చంద్రశేఖర్, అధికారులు ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : గ్రామాల అభివృద్ధి కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. బుధవారం మండల వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వీరాబాయి, ఎంపీఓ మజీద్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని మంతపురిలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి చైతన్య, పంచాయతీ కార్యదర్శి గొట్టం శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : పారిశుధ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ తండ మంగమ్మ, ఎంపీడీఓ నిరంజన్‌వలీ పిలుపునిచ్చారు. బుధవారం మండల వ్యాప్తంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నరేందర్‌గుప్తా, ఎంపీఓ పద్మావతి, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఎంపీటీసీ యాస కవిత, మాజీ సర్పంచ్ నగేశ్, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

రామన్నపేట : పారిశుధ్య వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ జలేందర్ రెడ్డి కోరారు. బుధవారం మండల వ్యాప్తంగా వీధుల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. మురికి కాల్వలను శుభ్రం చేశారు.

అడ్డగూడూరు : పారిశుధ్య వారోత్సవాలను ఎంపీపీ దర్శనాల అంజయ్య, మండల ప్రత్యేకాధికారి కృష్ణ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కిరణ్, జోజి, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ఆందోళన

మోత్కూరు పాత బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

మోత్కూరు, ఫిబ్రవరి 7 : వేతనాలు చెల్లించాలని మోత్కూర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. బుధవారం విధులు బహిష్కరించి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, శోభ, లింగమ్మ, సైదమ్మ, మల్లమ్మ, ఆండాలు, బుచ్చమ్మ, లక్ష్మి, చిన్న రేణుక, పెద్ద రేణుక, లింగమ్మ, స్వప్న, అనూష, ఎల్లమ్మ, శ్రీహరి, గీత, యాదమ్మ, రాములు, అరవింద్, పద్మ, ఎల్లయ్య, చంద్రయ్య, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, ఫిబ్రవరి 7 : చౌటుప్పల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు బెల్ట్ దుకాణాల తొలగింపునకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు కొయ్యడ సైదులుగౌడ్, ఉబ్బు వరమ్మ, అంతటి విజయలక్ష్మి, పోలోజు వనజ, సందగళ్ల విజయ, కాసర్ల మంజుల, కామిశెట్టి శైలజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

భువనగిరి మున్సిపాలిటీ యాప్‌తో పౌర సేవలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 7 : భువనగిరి మున్సిపాలిటీ యాప్‌తో పౌర సేవలతోపాటు సెప్టిక్ ట్యాంకులు ఖాళీ చేయించేందుకు ప్రత్యేక లింక్ అందుబాటులోకి వస్తుందని అడ్మినిస్ట్రేటర్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధి ఓంప్రకాశ్ తెలిపారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో ఏఎస్‌సీఐ ఆధ్వర్యంలో భువనగిరి మున్సిపాలిటీ యాప్‌పై వర్క్‌షాప్ నిర్వహించి మున్సిపల్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి అవినాశ్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

పదవులు అనుభవించి బీఆర్ఎస్‌ను బద్నాం చేయడం తగదు

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 7 : బీఆర్ఎస్‌లో ఉండి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సహకారంతో రెండు పర్యాయాలు డీఎల్‌డీఏ చైర్మన్‌గా పదవి అనుభవించి నేడు బీఆర్ఎస్ పార్టీని, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులను బద్నాం చేయడంతోపాటు విమర్శించడం డీఎల్‌డీఏ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డికి తగదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పిచ్చిరెడ్డి రాజీనామాతో పార్టీకి ఎలాంటి నష్టం లేదని పేర్కొన్నారు. పార్టీకి ద్రోహం చేసిన పిచ్చిరెడ్డికి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్ గౌడ్, జిల్లా నాయకుడు యాస ఇంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, గడ్డమీది రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ పల్లెర్ల సత్యనారాయణ, బీఆర్ఎస్ కూరెళ్ల గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎరుకల స్వామిగౌడ్, గడ్డం అశోక్, మాజీ ఉప సర్పంచ్ నరేశ్, ఆత్మకూరు(ఎం) గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, కొరటికల్ మాజీ సర్పంచ్ కోల సత్తయ్యగౌడ్, బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ దరఖాస్తుల స్వీకరణ

చౌటుప్పల్, ఫిబ్రవరి 7 : ఈ నెల 8, 9 తేదీల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాజుల సతీశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వినియోగదారులు రేషన్, ఆధార్ కార్డులతో పాటు విద్యుత్ బిల్ జిరాక్స్ కాపీలను జతపరిచి స్థానిక విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రంలో అందజేయాలని సూచించారు. ఇది కేవలం మున్సిపాలిటీ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లోని వినియోగదారులు తమ బిల్లులు వసూలు చేసే ప్రాంతాల్లో అందజేయాలని సూచించారు.

బహిరంగ వేలం వాయిదా

చౌటుప్పల్, ఫిబ్రవరి 7 : ఈ నెల 10న జరుగాల్సిన చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన హైవే షాపింగ్ కాంప్లెక్స్‌ల బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ తీర్మానం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి వేలం తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

బియ్యం అందజేత

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 7 : మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనిర్ కార్యకర్త కట్టెల గాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్వేల్ ఎంపీటీసీ-2 నర్రి పావని మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి రూ.50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టెల భిక్షపతి, ఎంపీటీసీ ఈసం యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు స్వామి, జంగయ్య, జగన్‌రెడ్డి, రమేశ్, నాగార్జున పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వలిగొండ, ఫిబ్రవరి 7 : మండల కేంద్రానికి చెందిన గోగు కుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దాంతో అతని బాల్య స్నేహితులు బుధవారం రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో గౌస్ బాబా, స్వామి, శ్రీనివాస్, వలీబాష, నరేశ్, వలయ్య, రామకృష్ణ, బాలశెట్టి, నరేశ్‌రెడ్డి, నరేశ్ ఉన్నారు.

ఇండియన్ గ్యాస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

గ్యాస్ సిలిండర్ హామీని అమలు చేయాలి

- మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సబిత

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 7: ఆరు గ్యారెంటీల పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500లరే ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం భువనగిరి లోని సరస్వతి ఎంటర్ ప్రైజెస్ ఇండియన్ గ్యాస్ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి రుక్మిణి, సభ్యులు రేష్మ, పూజిత, అలివేలు, మౌనిక పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి

- దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

వలిగొండ, ఫిబ్రవరి 7 : ఎన్నికల ముందు దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.6 వేల పింఛన్ అందజేయాలని దివ్యాంగ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నాగారంలో దివ్యాంగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ప్రతి దివ్యాంగుడికి అంత్యోదయ రేషన్ కార్డు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు పార్వతి, రేణుక, అనిత, శ్రీను, యాదయ్య, సావిత్రి, ఉమ, సైదులు, శ్రీహరి, స్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య

మోటకొండూర్, ఫిబ్రవరి 7 : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీలో ఉండి శాసనసభ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్యను అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నుంచి 6ఏండ్లు సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నిర్వహించే చలో నల్లగొండ బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ మల్లేశ్‌యాదవ్, మండల కోఆప్షన్ సభ్యుడు బురాన్, నాయకులు జివిలిక పల్లి వెంకటేశ్, బొట్ల శ్రీనివాస్, మహేశ్, ప్రశాంత్, వడ్డెబోయిన శ్రీనివాస్, మారబోయిన భాస్కర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

సీఎస్ఎన్ఆర్ కళాశాల అభివృద్ధికి కృషి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 7 : సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం భువనగిరిలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అడ్మిషన్లు పెంచేందుకు సహకరించాలని కోరారు. కళాశాల అభివృద్ధి కమిటీ కో కన్వీనర్ గోమారి సుధాకర్‌రెడ్డి, అతికం లక్ష్మీనారాయణ, కొలుపుల వివేకానంద, కమిటీ సభ్యులు హమీద్‌పాషా, పూస శ్రీను, జిట్ట భాస్కర్‌రెడ్డి, పెంట నర్సింహ, ఏశాల అశోక్, మద్ది వెంకట నర్సింహారెడ్డి, వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్ సమ్మెను జయప్రదం చేయండి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కూలీల, రైతుల, కార్మికుల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కాకుమారి పిలుపునిచ్చారు. బుధవారం సంఘం భువనగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని చీమలకొండూరు, ముత్తిరెడ్డిగూడెంలో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తుందని ఆరోపించారు. పని ప్రదేశాల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజు కూలి రూ.800 ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్తెమ్మ, బాలస్వామి, భవాని, నర్సింహ, యశోద, లూర్దయ్య, భవిత, అంజయ్య, పద్మ, గౌరమ్మ, జ్యోతి, రేణుక, సునీత, సంతోష, గీత, అమృత, సారమ్మ పాల్గొన్నారు.